



**ప్రియమైన అన్నగారికి మీ చెల్లెలు సంధ్య నమస్కరిస్తూ వ్రాయుట!**

**అన్నయ్యా! ఇది నీకు రాస్తున్న పదో ఉత్తరం. ఇంటి అడ్రస్‌కు రాసిన ఉత్తరాలకు ఏ సమాధానమూ రాకపోవడంతో చివరిగా నీ ఆఫీసు అడ్రసుకు రాస్తున్నాను. నేనిప్పుడు బాగున్నాను. నా మతిస్థిమితం బాగుంది. ఇది జరిగి ఏడు నెలలు పూర్తయ్యింది.** 'నువ్విప్పుడు బాగున్నావు మీ ఇంటికి మీరెళ్ళిపోవచ్చు' అంటూ హాస్పిటల్‌వారు పదేపదే చెబుతున్నారు. రాన్నయ్యా నన్ను మనింటికి తీసుకుపో. నా మతిస్థిమితం తప్పిన కాలంలో నన్ను చూడ్డానికి మీరు ఎన్నిసార్లు వచ్చారో రాలేదో నాకు తెలీదు. అప్పట్లో నేను పిచ్చిదాన్ని. తాడుకు, పాముకు తేడా తెలీనిదాన్ని. హాస్పిటల్‌వారి ద్వారా తెలుసుకున్నాను నేనిక్కడకు వచ్చి 15 ఏళ్ళయ్యిందని. మీ రాక కోసం ఎదురు చూస్తూ... రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకొని పోస్ట్ కోసం పంపించిందామె.

❄ ❄ ❄

"అనసూయా అనసూయా' అంటూ ఇంట్లోకి ప్రవేశించిన మూర్తి గట్టిగా అరిచాడు ఆవేశంతో. ఏదోవంట పనిలో ఉన్న అనసూయ భర్త కేకలు విని హాల్లోకొచ్చి

"ఏంటండీ మీ అరుపులు ఏమైందని?" అంది భర్తతో.

"ఏమైందా ..ఆ! ఇదివరలో సంధ్య నుండి ఉత్తరాలొచ్చాయా లేదా?"

"వచ్చాయి" ఏం చెప్పాలో అర్థంకాక నిజమే చెప్పిందామె.

"అవి నాకెందుకు ఇవ్వలేదు?"

"అంత అవసరం లేదనే"

"అవసరం లేదా? 15 ఏళ్ళ పిచ్చితనంతో మదనపడి తిరిగి మామూలు స్థితికొచ్చి తన్ను తీసుకుపొమ్మంటూ ఆమె రాసిన ఉత్తరాలకు ప్రాధాన్యం లేదా? చెప్పు ఎందుకు చేశావీ పని?" ఉక్రోషం ఆపుకోలేక ఆమె చెంప చెళ్ళుమనిపించాడు మూర్తి.

ఓసారి గతంలోకి వెళ్ళి నిదానంగా ఆ నిజపరదాల్ని నెమ్మదిగా తీసి చూస్తే.. తిరిగి రాని లోకాలకు తరలి వెళ్ళిన తల్లిదండ్రుల అకాల మరణంతో చెల్లెలి బాధ్యత మూర్తిపై పడింది. అయితే మరోసారి విధి కన్నెర్రో, వెంట్రుక వాసిలో తలరాత తిరగబడ్డమో ఏదైతేనేం సంధ్య మతిస్థిమితం కోల్పోయింది. అష్టకష్టాల్ని ఎదుర్కొంటూ తన చెల్లెల్ని మెంటల్ కేర్ హాస్పిటల్లో చేర్పించాడు మూర్తి. ఆపై ఆమెకోసం నెలనెలా కొంత మొత్తాన్ని కూడా పంపుతున్నాడతను. "మీకు మిగులున్న సర్వీసు కాలం ఎంతో దూరంలో లేదు. అలాగని మీకేం పెద్ద బ్యాంకు బేలన్సులు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ చిన్న భారమూ మనం భరించగలిగే స్థితిలో లేము. ఇరవై ఏళ్ళ వయసులో మతిస్థిమితం తప్పి ఇప్పుడు కోలుకున్న మీ చెల్లి వయస్సు ముప్ఫై అయిదు సంవత్సరాలు. ఇక వేరే చెప్పాలా! ఆపై రానున్న సమస్యలు?"

# జరుగుతున్న కథ

## లక్ష్మీ భారతీరెడ్డి

"అలాగని నా ఎంగిలి పాలు తాగి ఆడుతూ, ఆటపట్టిస్తూ నాతోపాటు పెరిగిన నా చెల్లిని గాలికొదిలేయమంటావా? నో నెవ్వర్ నాకు తెలుసు ఏం చెయ్యాలో. ఏం చెయ్యకూడదో. నీతి సూక్తులు, భవిష్యత్తును భూతద్దంలో చూస్తూ నువ్వు చెప్పే జోస్యం నాకొద్దు" స్థిర నిర్ణయంతో అన్నాడు మూర్తి.

మరుసటి రోజు...

ఉదయం పది గంటల ప్రాంతంలో తను పనిచేస్తున్న ఆఫీసుకు ఫోన్ చేసి అసలు విషయం మేనేజరుకు వివరించి నాలుగు రోజులు లీవుకు అనుమతి పొందాడు మూర్తి. ఆపై మెంటల్ కేర్ ఆసుపత్రికి బయలుదేరాడు భార్యకు నమమాత్రంగానే చెప్పి తన చెల్లెలి కోసం వెళ్ళాడు.

❄ ❄ ❄

ఎవరో అదేపనిగా మాటిమాటికీ తలుపు తట్టడంతో తలుపు తీసి చూసింది అనసూయ. ఎదురుగా సంధ్య. ఆమె సంధ్యని అనసూయకు తెలుసు కానీ ఆమె వదినని సంధ్యకు తెలీదు. కారణం సంధ్యకు మతిస్థిమితం తప్పాక కొన్ని నెలలకు మూర్తికి పెళ్ళయింది కనుక.

"మీరు" అంటూ ఆగిపోయింది సంధ్య.

"ఆ వివరాలు తర్వాత ముందిది చెప్పు, నువ్వెవరు?" తెలిసినా తెలియనట్లే అడిగింది అనసూయ.

"మూర్తిగారు మా అన్నయ్య కాస్త పిలుస్తారా?" ఇంట్లోనికెళ్ళే హక్కున్నా వెళ్ళే సాహసం చెయ్యలేక అన్నదామె.

"ఆ ఆ ఇప్పుడర్థమైంది, ఆ పిచ్చి సంధ్యవు నువ్వేనా?"

"క్షమించండి! నేనిప్పుడు పిచ్చిదాన్ని కాదు. ఆ భగవంతుడి దయతోపాటు మా అన్నయ్య ప్రార్థనలతో కోలుకున్న భాగ్యశాలిని. ఇంతకూ మీరు?"

"నేనా నువ్వంటున్న మీ అన్నయ్యకు భార్యను"

"వదినా" అంది ఆమె ఆప్యాయంగా వదినంటే తల్లి తర్వాత తల్లిలాంటిది అని తెలిసి ఆదరిస్తుందనే నమ్మకంతో.. ఆశతో..

"అలా పిలవకు నాకిష్టం లేదు"

"ఎందుకు వదినా?"

"ఎందుకా? నీ పిచ్చి తగ్గేసరికి నీ వయసు ముప్పై అయిదేళ్ళకు చేరుకుంది. సరీదు పిల్లలకు 'ల'కారాలతో సంబంధాలు అతి కష్టంగా కుదురుతున్న ఈ కాలంలో అర ముసలి వయస్సున్న నీకు సంబంధాలు ఎక్కడ్నుంచి తేగలం? ఒకవేళ గంతకు తగ్గ బొంతలా కుదిరినా ఆపై కట్నాలు ఎన్ని 'ల' కారాలు పలుకుతాయో? మా కిప్పటికే ఇద్దరు పిల్లలు, వారి చదువులు, భవిష్యత్తు గురించే మా ఆలోచనలు. తగుదునమ్మా.. అంటూ నువ్విప్పుడు రంగప్రవేశం చేస్తే మాతోపాటు మా పిల్లల భవిష్యత్తు ఏమౌతుంది?" నిర్మొహమాటంగా అంది అనసూయ.

"పోన్లెండి నా రాకతో మీరానందిస్తారను కున్నా. అంతేగాని బీడైపోయిన నా జీవితం మిమ్మల్ని ఇంతగా కలిచివేయబోతుందని ఊహించని వెర్రిదాన్ని. అది నా దురదృష్టం."

"............."

"ఓసారి అన్నయ్యను పిలుస్తారా? కనీసం ముఖమైనా చూసుకుని వెళ్తాను"

"ఉంటేగా పిలవడానికి? నువ్వెప్పుడు ఊడిపడతావోనన్న భయంతో అవసరం లేకున్నా నెలరోజుల క్యాంపు వాళ్ళ ఆఫీసర్ని అడిగి చేయించుకుని వెళ్ళారు"

"సరే వస్తానొదినా అన్నయ్య వస్తే నేనొచ్చి వెళ్ళానని చెప్పండి"

"వస్తాను అంటే కన్నా పోతాను అంటేనే బాగుంటుంది."

❄ ❄ ❄

మెంటల్ కేర్ అసుపత్రికి చేరుకున్న మూర్తి ఎంక్వయిరీ సెక్షన్‌కు వెళ్ళి తన పేరుతో సహా చెల్లెలి పేరూ చెప్పి ఆమె రాసిన ఉత్తరం వారికి చూపించాడు. నిముషం కంప్యూటర్ టకటకల తర్వాత ...

"సారీ మిస్టర్ మూర్తిగారూ! ఆమె ఈ ఉదయమే ఇక్కడ నుంచి వెళ్ళిపోయింది" అన్నారు ఎంక్వయిరీవారు.


"ఎలా? ఆమెను ఈ హాస్పిటల్లో చేర్పిం


## ఎక్కడో ఏదో లోపముంది



ఎక్కడో ఏదో లోపముంది
గుంభనంగా సాగిపోతోంది గజరాజు
అదేపనిగా మొరుగుతూ శునక
సమూహం
చకచకా దూసుకుపోతోంది
రైలుబండి
గురిపెట్టి సూదంటూరాయి
విసురుతూ కుర్రాడు
హఠాత్తుగా ప్రకటించారు రాస్త్రారోకో
అస్తవ్యస్తమయింది రవాణా వ్యవస్థ
అవినీతి మీసం మెలివేస్తోంది
బాహాటంగా
ప్రశ్నించడానికి మొహమాటపడుతూ
బాధితులు
అక్షరు నోట్లో లేకపోయినా లక్ష ఓట్ల
మెజారిటీ
తత్వాల విచిత్ర వైఖరి పరిశీలనలో
శోధితులు
ఎక్కడో ఏదో లోపముంది
అది వర్తమాన సమాజ స్థితిగతులపై
కోపమా?
కొరడా మార్పిడితో మనిషికి తప్పని
శాపమా?
తెలుసుకోవాల్సిన తరుణమిది
కోలుకుని మేలుకోవడానికై
ఎక్కడో ఏదో లోపముంది

– గుండాన జోగారావు






# ఔషధగుణాల మారేడు

పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మారేడులో అనేక ఔషధగుణాలున్నాయి. బిల్వం, శైలూష, శ్రీఫల శాండిల్య, మలూరము, ధూమ్రాక్ష ఇత్యాది పేర్లతో జగద్విఖ్యాతి గాంచినది. అధర్వణవేదం శ్రీ సూక్తం మారేడు వర్ణన వుంది. మారేడుదళం మూడు పత్రాలను కలిగి ఉండటం విశేషం. కుడి ఎడమలు విష్ణు, బ్రహ్మలు, మధ్యన పరమశివుడని భక్తుల విశ్వాసం. మారేడు చెట్టు మొదలు నుండి నూరు మూరల వరకు ఉన్న ప్రదేశం పవిత్రమైనదిగా భావిస్తారు. వేయి పద్మాలతో చేసే పూజాఫలం ఒక్క బిల్వదళంతో చేస్తే లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. బిల్వ వనం కాశీతో సమానం కాగా బిల్వ వృక్షం ఒక్కటే గంగాతీరంతో సమానం. ఆ వృక్షం ఉండే తావులో పరమశివుడు లింగ రూపంలో కానీ, అదృశ్యంగా గానీ ఉంటాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. బిల్వం ఇంటి ఆవరణలో ఈశాన్యం నందుంటే ఐశ్వర్యం, తూర్పున సౌఖ్యం, పశ్చిమాన పుత్ర సంతాన వృద్ధి, ఒక్క దక్షిణాన మాత్రమే ఆపదల నివారణ సంభవిస్తాయని వాస్తు పండితులు చెబుతుంటారు.

తమిళ, మలయాళ ప్రాంతాలవారు విల్వన్ అని, మరాఠీ, హిందీలో బేల్, సంస్కృతంలో శ్రీఫల, బిల్వ, ఆంగ్లంలో ఉడ్ ఆపిల్ అని పిలుస్తారు. బిల్వదళం మూడు పత్రాలేకాదు కొన్ని ఆకులు అయిదు, పదకొండు పత్రాలను సైతం కలిగి వుంటాయి. మధ్యరకం మారేడు చెట్టు నిండా ముళ్ళుంటాయి. నిమ్మకాయలంత చిన్నవి, దబ్బకాయంత పెద్దవి ఇలా రెండు రకాల కాయలు గుండ్రంగానూ, కోలగానూ కాస్తాయి. మారేడుపండు లోపలి గుజ్జు వెలగ గుజ్జువలే వుంటుంది. దీనిలో సువాసన కూడా ఉంటుంది. పండుపై చెక్కు దళసరిగా ఉండి చేదు రుచిని కలిగి ఉండటంతో పక్షులకు ప్రీతిపాత్రమైనది కాదు.

ఆయుర్వేదశాస్త్రం ప్రకారం మారేడులో అనేక ఔషధ గుణాలున్నాయి. మారేడుకాయ గుజ్జు ఎసిడిటీని, దీని పూలు అతిసారాన్ని తగ్గించడానికి వాడతారు. మారేడు ఆకుల రసాన్ని ఒంటికి పూసుకుని కొద్దిసేపు ఆగి స్నానం చేస్తే శరీరం నుండి వెలువడే దుర్గంధం దూరమవుతుంది. మారేడు గుజ్జుతో తయారుచేసిన శీతల పానీయాలు శరీర ఉష్ణాన్ని తగ్గించి ఎండదెబ్బ నుండి ఉపశమనం కలుగజేస్తుంది. ఈ పండు గుజ్జుతో చేసిన హల్వా రుచిగా ఉండటమేకాక ఆరోగ్యాన్ని కలుగజేస్తుంది. మారేడు ఆకులను గాలి సోకని గదిలో ఉంచినట్లయితే దుర్గంధాన్ని నిరోధించి చక్కటి వాసనలను వెదజల్లుతుంది.

- షేక్ అబ్దుల్ హాకీం జాని



చింది నేను. అలాంటిది సంబంధిత వ్యక్తి రాకుండానే ఎందుకామెను బయటకు పంపేశారు?" ఆవేశంగా అన్నాడు మూర్తి.

"ఆమె మీకేమౌతుంది?"

"చెల్లి"

"చెల్లెలు అంటున్నారు సరే. కానీ ఏడు నెల్ల నుంచి ఆమెకు చెప్పాం. "ఇక నువ్వెళ్ళొచ్చు" అని, అదేవిధంగా ఆమె మీకు ఉత్తరాలు రాసే అవకాశమూ కల్పించాం. ఇవన్నీ అయ్యాక మీ నుంచి ఏ రెస్పాన్సు రాలేదని ఆమెద్వారా తెలుసుకుని, హాస్పిటల్ తరపున మేమూ మీకు ఉత్తరాలు రాశాం. కానీ మీ నుంచి జవాబు రాలేదు. కాస్త ఆలోచించండి. జబ్బు నయం అయినా తిరిగి ఇక్కడే తిష్టవేస్తే మారి కొత్తగా వచ్చే రోగులకు చోటెక్కడ ఇవ్వగలం? చివరకు మీ రాక కోసం ఎదురు చూసి చూసి ఆఖరికి ఆమెకు మానవతా దృక్పథంతో కొంత మొత్తాన్ని చెల్లించి పంపడం జరిగింది. ఊరికే అరిస్తే సరిపోదు, మా సమస్యలు అర్థం చేసుకోవాలి." ఏమీ చెయ్యలేక ఒక వేళ నా చెల్లెలు హాస్పిటల్ వారి సూచన ప్రకారం నా ఇంటికి చేరిందేమో? అనుకుని వెనుదిరిగాడు మూర్తి.

❋ ❋ ❋

ఆ రాత్రంతా ఆలోచించింది సంధ్య. చివరకో నిర్ణయానికి వచ్చేసింది. తెల్లారడానికి కొన్ని గంటలే మిగిలున్నాయి. నెమ్మదిగా నడిచింది రైలు పట్టాల వైపు ఏ భయం లేకుండానే. కన్ను తెరిస్తే ఉయ్యాల కన్ను మూస్తే మొయ్యాల అన్న ఓ ప్రముఖ వ్యక్తి గీత రచయిత సాక్షిగా. చీకట్లను పారద్రోలి మళ్ళీ ప్రపంచానికి వెలుగిస్తున్నానంటూ సూరీడు కొంత కొంత వెలుగు బాణాలను ప్రతి సంధిస్తున్నాడు.

రైలు పట్టాలను చేరిన ఆమె తలను కాళ్ళను రైలు పట్టాలపై ఉండేలా జాగ్రత్త తీసుకుని పడుకుంది ప్రశాంతంగా అనలేం గాని, నిర్భయంగా మృత్యువుని ఆహ్వానిస్తూ! దూరంగా రైలుకూత వినిపిస్తోంది. ←